క్లుప్తంగా

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న భజన బృంద సభ్యులు

మాడుగుల రూరల్: అయోధ్య రాముడు అక్షింతలు పంపిణీ కార్యక్రమం గురువారం జి.అగ్రహారంలో నిర్వహించారు. జై శ్రీమన్నారాయణ భజన బృందం ఆధ్వర్యంలో 200 మంది సభ్యులు ఐదు గ్రూపులుగా విడిపోయి, ఇక్కడ ప్రతి ఇంటికి వెళ్లి ఐదొందల కుటుంబాలకు అక్షింతలు, కర్రపత్రం, శ్రీరాముని చిత్ర పటం అందజేశారు. ముందుగా గ్రామంలో అక్షింతలను ఊరేగించారు.

నేడు గాలిగోపురం పసిడి కలశస్థాపన

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో మోదకొండమ్మ గాలిగోపురం పసిడి శిఖరం కలశస్థాపన కార్యక్రమం శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు రామధర్మజ, రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు.

చీడికాడ ఎస్‌ఐగా నారాయణరావు

అనకాపల్లికి ఎస్‌ఐ రామారావు బదిలీ



చీడికాడ: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా జి.నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ పి.రామారావు అనకాపల్లి మోనటరింగ్ సెల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొటవురట్ల మండలం ఎస్‌ఐ నారాయణరావు చేరారు.

రక్తహీనత నివారణకు చర్యలు



తూటిపాలలో విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మాకవరపాలెం: రక్తహీనత నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని బూరుగుపాలెం వైద్యాధికారి చరణ్ తెలిపారు. గురువారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బరువు, ఎత్తుకు సంబంధించిన కొలతలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న వారు క్రమం తప్పకుండా ఐరన్ పోలిక్ మాత్రలు వేసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. వ్యక్తిగత శుభ్రతపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంఈవో మూర్తి, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ అంధులంతా చదువుకునేందుకు వీలుగా బ్రెయిలీ లిపిని సృష్టించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం గడ్డినాయుడు, భవిత కేంద్రం కో ఆర్డినేటర్ మంగ పాల్గొన్నారు.

ఉప్పవరంలో మేలుకొలుపులు

అచ్యుతాపురం: ఉప్పవరంలో ధనుర్మాస మేలుకొలుపులు గురువారం తెల్లవారుజామున నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భజనలు చేసుకుంటూ గ్రామంలో సంచరించారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు,చిన్ని రాముడు తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో ప్రారంభానికి సిద్ధంగా పీఆర్ వసతి గృహం



మాడుగులలో ప్రారంభానికి సిద్ధంగా కోల్డ్ స్టోరేజీ భవనాలు

అభివృద్ధి గ్రామాలు ఆహ్వానం

- 8 గ్రామాల్లో రూ.10.30 కోట్లతో పూర్తయిన పనులు ప్రారంభం నేడు
- హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: మండలంలో అభివృద్ధి గ్రామాలు ఆహ్వానం పలుకుతున్నాయి. రూ.10.30 కోట్లతో ఎనిమిది గ్రామాల్లో పూర్తి చేసిన ప్రభుత్వ భవనాలను, రోడ్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై వీటిని శుక్రవారం ప్రారంభించనున్నారు. మాడుగుల పట్టణంలో రూ.1.40 కోట్లతో పీఆర్ వసతి గృహం, రూ.1.40 కోట్లతో కోల్డ్ స్టోరేజీ, రూ.35 లక్షలతో గణేష్ కాలనీ డ్రైనేజీలు, రూ.1.8 కోట్లతో హైస్కూల్ కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, రూ.68 లక్షలతో పోతనపూడిలో గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలు, రూ.1.90 కోట్లతో వీరవల్లి పోతనపూడి మీదుగా బంగారు మెట్టకు పక్కా రోడ్డు, రూ.10 లక్షలతో ఎం.కోడూరులో ఆయుష్ ఆస్పత్రికి సంబంధించి నాడు - నేడు అభివృద్ధి పనులు, రూ.2.55 కోట్లతో ఎల్‌బీపట్నం నుంచి కేఎల్‌బీ పట్నం, కేఎల్‌బీ పట్నం నుంచి మాడుగుల వరకు రోడ్డు, రూ.70 లక్షలతో మాడుగుల పట్టణంలో దేవీ ఆలయం నుంచి మోదమాంబ కాలనీ వరకు సీసీరోడ్డు డ్రైనేజీలు ప్రారంభోత్సవం చేయనున్నారు.

వీటితోపాటు రూ.6.50 కోట్లతో మాడుగుల నుంచి డి.గొటివాడ రోడ్డుకు, రూ.9 కోట్లతో ఘాట్ రోడ్ జంక్షన్‌లో కింతలి రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు.

మాడుగులలో అభివృద్ధి వెలుగులు



వెనుకబడిన మాడుగుల మండలం ప్రగతి పథంలో పరుగులు పెడుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో కోట్లాది రూపాయల పనులు పూర్తయ్యాయి. పలు భవనాలు, రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికే మాడుగుల పట్టణంలో రూ.2 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, రూ.80 లక్షలతో అగ్రిల్యాబ్ నిర్మించారు. రూ.5.50 కోట్లతో ఆస్పత్రి, రూ.10 కోట్లతో ఇంటింటికి కుళాయిల ఏర్పాటు పనులు చేస్తున్నారు.

– బొమ్మిశెట్టి శ్రీనివాసరావు , హైస్కూల్ కాలనీ మాడుగుల



పోతనపూడిలో ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ, ఆర్బీకే భవనాలు



మాడుగుల నుంచి ఎల్‌బీ పట్టణానికి వేసిన పక్కారోడ్డు



మాడుగుల హైస్కూల్ కాలనీలో పూర్తయిన సీసీ కమ్ డ్రైనేజీలు

ఎన్నికలకు సమాయత్తం కావాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం



సమావేశానికి హాజరైన సెక్టోరియల్ అధికారులు, పోలీసు అధికారులు

నర్సీపట్నం: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సమాయత్తం కావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం పిలుపునిచ్చారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాతో కలిసి ఆయన సెక్టోరియల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వర్తించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఎవరి విధులు వారే నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

నర్సీపట్నంలో సీసీరోడ్ల పనులు ప్రారంభం



కొబ్బరి కాయ కొట్టి సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 2, 4 వార్డుల్లో రూ.19 లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన గురువారం ప్రారంభించారు. వార్డులో చేతిపంపు ఏర్పాటుతోపాటు మిగిలిన రోడ్లను అభివృద్ధి చేయాలని వార్డు మహిళలు కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రెండు వార్డుల్లో ఐదు సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, రెండు వార్డుల కౌన్సిలర్లు సిరసపల్లి నాని, దాడి కృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నాయకులు సిర సపల్లి వేణు, దాడి బుజ్జి, కిల్లాడ లోవరాజు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు



నిందితుడితో ఎస్‌ఈబీ సీఐ రాజారావు

నాతవరం: సారా విక్రేతను పట్టుకుని కేసు నమోదు చేశామని గొలుగొండ ఎస్‌ఈబీ సీఐ కె.రాజారావు గురువారం తెలిపారు. మండలంలో గుమ్మడిగొండ పరిసరాల్లో ఆకస్మికంగా దాడులు నిర్వహించి, గ్రామానికి చెందిన ఆవుడు వాసు (26)ను పట్టుకున్నామన్నారు. అతని నుంచి పది లీటర్ల సారా, పది లీటర్ల బెల్లం పులుపు స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో సారా తయారీ చేస్తున్నట్లుగా తమ దృష్టికి రావడంతో ఈ దాడులు నిర్వహించామన్నారు.

జెడ్పీటీసీ రమణమ్మకు పరామర్శ



రమణమ్మను పరామర్శిస్తున్న ధర్మశ్రీ

రావికమతం: జెడ్పీటీసీ తలారి రమణమ్మను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం కొత్తకోటలో ఆమె స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ధర్మశ్రీ ఆమె క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో మళ్లీ చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. పార్టీ చోడవరం సీనియర్ నాయకుడు శంకర్రావు, తలారి ఆదిమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం









కె.కోటపాడు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

పలు చోరీలకు పాల్పడిన నిందితుని అరెస్టు



మాట్లాడుతున్న ఏఎస్పీ టి.ఎస్.రావు



నిందితుడు పిల్లా నూకరాజు(ఫైల్)

పరవాడ: అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 10 చోరీ కేసులతో సంబంధం ఉన్న నిందితుడిని పరవాడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషినల్ ఏఎస్పీ పి.సత్యనారాయణరావు (క్రైం) చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామంలో గత నెల 7న జరిగిన చోరీలో అర తులం బంగారం, రెండు జతల వెండి పట్టీలు, రూ.8,500 నగదు అపహరణకు గురయ్యాయి.

ఈ కేసుకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు నేతృత్వంలో క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్లా నూకరాజును లంకెలపాలెం కూడలిలో గురువారం అదుపులోకి తీసుకుని ప్రశ్నయించారు. నిందితుడు నూకరాజు అనకాపల్లి జిల్లా రావికమతంలో 3, దేవరాపల్లిలో 2, చీడికాడలో 1, సబ్బవరం, కోటపాడు, బుచ్చెయ్యపేట, మంత్రిపాలెం ప్రాంతాల్లో 10 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. ఈ చోరీ కేసుల్లో నిందితుడు 28 తులాల బంగారం, 39 తులాల వెండి, రూ.1.48 లక్షల నగదును అపహరించినట్లు కనుగొన్నామని చెప్పారు. నిందుతుడి నుంచి 22 తులాల బంగారు ఆభరణాలు, రూ. 2,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీని అతి తక్కువ సమయంలో ఛేదించిన పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, క్రైం ఏఎస్ఐ బి.ఎర్రునాయుడు, పోలీసులు ఎస్.నాగేంద్ర, జి.వి.వి.ఎస్.నాయుడు, ఎం.దివాకర్‌బాబు, జి.మోహన్‌ప్రసాద్, సీసీఎస్ ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ ప్రదీప్‌కుమార్‌లను ఏఎస్పీ పి.సత్యనారాయణరావు ప్రశంసించారు.

అవ్వాతాతల ఆనందమే సీఎం ఆశయం

కొత్త పింఛన్లు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కొత్త పింఛన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



పెంచిన పింఛన్లు అందిస్తున్న ఉమాశంకర్ గణేష్



అన్నవరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన పింఛనుదారులు



రోలుగుంట: జె.నాయుడుపాలెంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

చోడవరం: అవ్వాతాతల ఆనందమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం చోడవరం హార్డింజ్ రెస్ట్ ఆవరణంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల పరిధిలో 823 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈ నెల నుంచి పింఛన్‌ను రూ. 2,750 నుంచి రూ. 3 వేలకు పెంచిన పింఛన్‌ను చోడవరం మండలంలో 12,784 మందికి మేలు జరిగింది. వారందరికీ వలంటీర్ల ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం రూ. 2 వేల పింఛన్‌ను ఏటా పెంచుకుంటూ పోతామని చెప్పిన జగనన్న రూ. 250 చొప్పున పెంచి ఈ నెల నుంచి రూ. 3 వేలు ఇస్తున్నామన్నారు. పింఛన్ల కోసం మాట్లాడే అర్హత తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదన్నారు. ఎన్నికల ముందు పప్పు బెల్లాల్లా పంచి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని తర్వాత వాటిని విస్మరించే సంస్కృతి చంద్రబాబుదని విమర్శించారు. ముందు గత పాలనలో ఎన్ని పథకాలు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పేదలకు అండగా ఉంటూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని చూస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్ సుందర్, తహసీల్దార్ తిరుమలబాబు, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నవరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం ...

ఈ నెల నుంచి రూ.3 వేలకు పింఛన్ పెంచడంతో పాటు కొత్త పింఛన్లు మంజూరు కావడంతో వారంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయం –5 పరిధి అన్నవరంలో పింఛన్‌దారులంతా సీఎం చిత్రపటాన్ని ఊరేగించి, అంబేద్కర్ కాలనీ వద్ద క్షీరాభిషేకం చేశారు. జనం కోసం పనిచేసే ఈ ముఖ్యమంత్రే మాకు కావాలంటూ వారంతా నినాదాలు చేశారు. పట్టణ ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనువాసరావు, మండల యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం: ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: అన్ని వర్గాల వారికీ 2019లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక పింఛన్ల పెంపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ, అభివృద్ధిని అమలు చేశారన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా అనేక పథకాలు అమలు చేసి ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తున్నారన్నారు. మండలంలో ఇప్పటి వరకు 8,741 పింఛన్లు ఉండగా, కొత్తగా మరో 104 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర ప్రజలంతా మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జెలపు మణికుమారి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జీ, జక్కు నాగమణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల్లో ఆనందం

రోలుగుంట: జె.నాయుడుపాలెంలో ఈ నెల నుంచి రూ.3 వేల పింఛన్ అందుకున్న లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. ఈ మేరకు సర్పంచ్ బగుడు వెంకటరమణతో కలసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత నెల వరకు 711 మంది లబ్ధిదారులుండగా, ఈ నెల కొత్తగా 15 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారన్నారు.

కేజేపురంలో...

మాడుగుల రూరల్: వైఎస్సార్ పింఛను కానుకలో భాగంగా కేజేపురం మేజర్ పంచాయతీలో గురువారం లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో 12 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, నాయకులు కాళ్ల అప్పలనాయుడు, ఆడారి కన్నారావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం

అచ్యుతాపురం : బ్రాండెక్స్‌లోని ఉద్యోగులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు ఎంత ఖర్చుకయినా వెనుకాడడం లేదని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు. బ్రాండిక్స్ అపెరల్ పార్కులోని అక్షయపాత్ర కిచెన్ రూమ్‌ను సందర్శించిన ఆయన కార్మికులతో మాట్లాడారు. ఐదు కోట్ల రూపాయల వ్యయంతో ఎకరా స్థలంలో అక్షయ పాత్ర సంస్థ ద్వారా వండే ఆహారాన్ని బ్రాండిక్స్‌లోని అన్ని యూనిట్లకు పంపిస్తున్నామని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

దేవరాపల్లి: పెదనందిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మండల ప్రతినిధులు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పబ్లిక్ పరీక్షల సమయంలో అనుసరించాల్సిన విధానంపై పలు సలహాలు, సూచనలు చేశారు.

కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దేముడునాయుడు, యూటీఎఫ్ జిల్లా నాయకుడు దొగ్గ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, కార్యదర్శి ప్రకాశ్‌బాబు, కొరతం కృష్ణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటాపోటీగా 'ఆడుదాం ఆంధ్రా'



చీడికాడలో షటిల్ ఆడుతున్న యువకులు

చీడికాడ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడలు గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో యువత ఉత్సాహంగా పాల్గొంది. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయికి ఎంపిక చేస్తున్నట్టు ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు.